ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం

◆ ఎన్నికల తొలి ప్రక్రియ ఆరంభం ◆ సిద్ధమవుతున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టం గురువారం విడుదల చేసే ఎన్నికల నోటిఫికేషన్‌తో ప్రారంభంకానుంది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఈ రోజు నుంచి ఏప్రిల్ 25 వరకు పనిదినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఆ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు దాఖలు చేయాలి. పార్లమెంట్ అభ్యర్థులు కలెక్టరేట్‌లోని లోక్‌సభ రిటర్నింగ్ అధికారికి దాఖలు చేయాల్సివుంది. గురువారం ఎన్నికల నామినేషన్ ప్రక్రియతో ప్రారంభంకానున్న సమరం జూన్ 4న ఓట్ల లెక్కింపుతో ముగియనుంది. జిల్లాలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం, అనకాపల్లి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాలు, పెందుర్తిలోని సబ్బవరం, పరవాడ మండలాలు ఉన్నాయి. పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



వ్యవహరించనున్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అభ్యర్థులు పాటించాల్సినవి

ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పుడు కొన్ని నిబంధనలు పాటించాలి. ఎమ్మెల్యేగా పోటీచేసే జనరల్ అభ్యర్థి రూ.10 వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థి కుల ధ్రువీకరణ పత్రంతో పాటు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి. ఎంపీ అభ్యర్థి జనరల్ అయితే రూ.25 వేలు, ఎస్‌సి, ఎస్‌టి అయితే రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి. డిపాజిట్ ఆన్‌లైన్ ద్వారాగానీ, నామినేషన్ సమయంలో ఆర్‌ఓ కార్యాలయం వద్దగానీ జమ చేయాలి. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి కనీసం వంద మీటర్ల దూరంలో ప్రదర్శన నిలిపివేయాలి. రిటర్నింగ్ అధికారి కార్యాలయం లోపలకు మూడు వాహనాలు, ఆర్‌ఓ ఛాంబర్‌లోకి అభ్యర్థితో పాటు మరో నలుగురిని అనుమతించనున్నారు. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థికి ఒకరు, స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ఓటర్లు బలపర్చాల్సివుంది. నామినేషన్ ఫారాలను అభ్యర్థిగానీ, అతనిని బలపర్చే వారెవరైనా మిగతా 2లో..

నామినేషన్ల స్వీకరణ :
ఏప్రిల్ 18 నుంచి 25 వరకు
నామినేషన్ల పరిశీలన : ఏప్రిల్ 26
నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు : ఏప్రిల్ 29
పోలింగ్ : మే 13
ఓట్ల లెక్కింపు : జూన్ 4

మండుతున్న ఎండలు



రెండు రోజులుగా విశాఖలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పెద్దగా ఎవరూ రోడ్లు మీదకు రావడం లేదు. దీంతో నగరంలోని మద్దిలపాలెం, గురుద్వారా, గాజువాక, ద్వారకానగర్, జగదాంబ కూడళ్లు బుధవారం మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కనిపించాయి.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేసేందుకు దువ్వాడ మీదుగా ఎర్నాకులం - పాట్నా అన్ రిజర్వుడ్, ఎస్ఎంవి బెంగళూరు - హౌరా మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 06085 ఎర్నాకులం - పాట్నా అన్‌రిజర్వ్‌డ్ సమ్మర్ స్పెషల్ రైలు ఏప్రిల్ 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 23.00 గంటలకు ఎర్నాకులం నుండి బయలుదేరుంది. ఇది మరుసటి రోజు రాత్రి 23.05 గంటలకు దువ్వాడ చేరుకుని 23.07 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 3.00 గంటలకు పాట్నా చేరుకుంటుంది. 06086 పాట్నా - ఎర్నాకులం అన్‌రిజర్వ్‌డ్ సమ్మర్ స్పెషల్ రైలు ఏప్రిల్ 22 నుంచి జూలై 01 వరకూ ప్రతి సోమవారం 23.45 గంటలకు పాట్నాలో మిగతా 2లో..

మళ్ల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

▸ వార్త 8లో..

ఇద్దరు యువకులు దుర్మరణం

▸ వార్త 3లో..

అగనంపూడిలో సిపిఎం ఎన్నికల ప్రచారం

▸ వార్త 8లో..



పోర్టు సమీపంలో ఆందోళన కొనసాగిస్తున్న అదానీ గంగవరం పోర్టు కార్మికులు

అర్ధరాత్రి పనులకు యత్నం.. ప్రతిఘటించిన కార్మికులు...

గంగవరం పోర్టు వద్ద కొనసాగుతున్న ఆందోళన మిగతా 8లో..

మొదటి పేజీ తరువాయి..

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం

రిటర్నింగ్ అధికారికి సమర్పించవచ్చు. సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. ఆ పత్రాలను ఆర్‌ఒ కార్యాలయానికి అందజేయాలి. పోటీచేసే అభ్యర్థి ఆ నియోజకవర్గంలో ఓటరుకాకపోతే, సర్టిఫికేట్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్ ధ్రువపత్రం నామినేషన్‌తో పాటు జతచేయాల్సివుంది. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఎన్నికల ఖర్చు చేయవచ్చు. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఖర్చును లెక్కిస్తారు.

జిల్లాలో అసెంబ్లీ రిటర్నింగ్ అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు

అసెంబ్లీ	రిటర్నింగ్ అధికారి పేరు	ఫోన్ నెంబర్
అనకాపల్లి	ఎం.జాహ్నవి	7702896799
చోడవరం	ఎజి.చిన్నికృష్ణ	8978281888
మాడుగుల	బివి.సత్యవాణి	9100384699
నర్సీపట్నం	హెచ్‌వి జయరామ్	7893964954
పాయకరావుపేట	కె.గీతాంజలి	8333025635
యలమంచిలి	కె.మనోరమ	9959333477

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 01.05 గంటలకు దువ్వాడ చేరుకుని 01.07 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 10.30 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కియోంజర్ రోడ్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి .

06585 ఎస్ఎంవి బెంగళూరు – హౌరా సమ్మర్ స్పెషల్ ఏప్రిల్ 19 నుండి జూన్ 24 వరకు ప్రతి శుక్రవారం అర్ధరాత్రి 00.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 19.25 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. మరలా 19.27 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు హౌరాకు చేరుకుంటుంది. 06586 హౌరా – ఎస్ఎంవి బెంగళూరు సమ్మర్ స్పెషల్ ఏప్రిల్ 20 నుండి జూన్ 25 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 13.05 గంటలకు హౌరాలో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 03.03 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరలా 03.05 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 20.10 గంటలకు ఎస్ఎంవి బెంగళూరుకు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి.

గిరిజన గ్రామాల్లో ఎల్ఇడి వెలుగులు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : 'ప్రతి రోజు సూర్యుడు' కార్యక్రమంలో భాగంగా మన్యం పార్వతీపురం జిల్లాలో 61 గిరిజన, మధ్య తరగతి పల్లెలలో 700 అత్యంత నాణ్యమైన ఎల్ఇడి దీపాలను అమర్చామని సిగ్నిఫై మార్కెటింగ్ హెడ్ నిఖిల్ గుప్తా తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'గ్రాస్ రూట్' స్వచ్ఛందసంస్థ భాగస్వామ్యంతో జనకల్యాణ సమాఖ్య సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. మన్యంలో మహిళలు, స్థానిక సంఘాల భద్రత, రక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు కింద గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపామన్నారు. వీధులలో వెలుగు ఉంటే క్రూరమగాల ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు పిల్లలు బయట ఎక్కువగా అడుకోవడానికి, మహిళల భద్రతకు భరోసాగా ఉంటుందన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అబ్బురపరిచిన అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌డ్రిల్ అబ్బురపరిచింది. షార్ట్‌సర్క్యూట్, ఇతర అగ్నిప్రమాదాల సమయంలో పొగ ఎక్కువగా ఉన్నపుడు స్వీయ ప్రాణరక్షణతోపాటు బాధితుల ప్రాణాలను ఎలా కాపాడాలో వివరిస్తూ ప్రయోగాత్మకంగా అగ్నిమాపక సిబ్బంది చేసిన డ్రిల్ ఆకట్టుకుంది. ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు, లిఫ్ట్‌లో ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఇంటర్ సర్వీసెస్ వాటర్ పోలోలో విజేత ఇండియన్ నేవీ

ప్రజాశక్తి -ఎంవివి కాలనీ : నగరంలోని డాల్ఫిన్‌హిల్ స్విమ్మింగ్ పూల్‌లో తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 73వ ఇంటర్ సర్వీసెస్ వాటర్ పోలో ఛాంపియన్‌షిప్ విజేతగా ఇండియన్ నేవీ జట్టు నిలిచింది. సేవా సిబ్బంది మధ్య స్నేహభావాన్ని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతోపాటు రాబోయే 77వ సీనియర్ నేషనల్స్ ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సర్వీసెస్ టీమ్ ఎంపికకు ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహించారు. . 30 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత నౌకాదళం, భారత వైమానిక దళం జట్లు, పూల్‌లో తలపడ్డాయి. అసాధారణ నైపుణ్యం ప్రదర్శించిన నేవీ జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ముఖ్య అతిథిగా సబ్‌మెరైన్స్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ కె.వెంకట్రామన్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా ఆక్వాటిక్ క్రీడాకారులను సత్కరించారు.



విజేతగా నిలిచిన ఇండియన్ నేవీ జట్టు సభ్యులు

'తోట'కు జైలుశిక్షపై హర్షం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దళితులకు శిరోముండనం కేసులో 28ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత తోట త్రిమూర్తులకు ఏడాదిన్నర జైలు, రూ.3.50 లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునివ్వడంపై దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ బుధవారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, కోర్టు తీర్పులు ఆలస్యంగా రావడం వల్ల నిందితులకు మనోధైర్యం పెరిగి, మరిన్ని అకృత్యాలకు ఆస్కారమేర్పడుతందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న నూతన్ నాయుడు, డాక్టర్ సుధాకర్ ఘటనలు ఇందుకు నిదర్శనమన్నారు.

చుండూరు, కారంచేడు ఘటనల్లో 32గడచినా నేటికీ బాధితులకు న్యాయం జరగలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, అత్యాచార కేసుల్లో తీర్పులు త్వరగా రావాలని ఆకాంక్షించారు. దళితుల శిరోముండనం కేసు వాదించిన న్యాయవాది బొజ్జా తారకంకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు.

వంశీకి బి-ఫారం అందజేసిన పవన్

ప్రజాశక్తి- కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ అభ్యర్థిత్వం ఖరారైంది. బుధవారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బి–ఫారం అందజేశారు. అయితే జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్‌కు టిక్కెట్ కేటాయింపుపై కొన్నాళ్లు స్థానిక కేడర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తోంది. ఈ మేరకు వంశీకృష్ణకు టిక్కెట్ ఇస్తే దక్షిణంలో గెలుపు సాధ్యం కాదని, అభ్యర్థిని మార్చాలని కొందరు ముఖ్య నాయకులు ఇటీవల డిమాండ్ చేస్తూ వస్తున్నారు జనసేన 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్, మత్స్యకార సంఘం నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు తదితరులు అధినేతకు బహిరంగ లేఖను కూడా రాశారు.

అయితే వీటిని పరిగణనలోకి తీసుకోకుండా వంశీకృష్ణకు టిక్కెట్ కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అనుకూలంగా పనిచేయబోమని తెగేసి చెప్పిన సాదిక్ తదితర అసమ్మతి నేతలు వైఖరి ఏంటో తెలియాల్సి ఉంది.

పోటీ పరీక్షల సన్నద్ధతపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐఐటి, జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షల సన్నద్ధతపై ప్రముఖ లెర్నింగ్ ఉడాన్ ఈవెంట్ ద్వారా యాప్ 'అన్ అకాడమీ' సంస్థ తమ అధ్యాపకులతో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించింది. బుధ వారం సిరిపురంలోని సంస్థ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అన్ అకాడమీ రీజనల్ కోఆర్డినేటర్ జగ్నూర్ సింగ్ మాట్లాడుతూ ఉడాన్ ఈవెంట్ ద్వారా నిపుణులైన అధ్యాపకులతో విద్యార్థులు నేరుగా ఇంటరాక్ట్ అయి, ఐఐటి, జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో విజయానికి అవసరమైన మార్గనిర్దేశం పొందడానికి సమగ్ర వేదిక అన్నారు. పోటీ పరీక్షలకు కావాల్సిన సలహాలు, సూచనలు, నిపుణుల చిట్కాలు, వ్యూహాలను ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా పొందవచ్చన్నారు. ఈసందర్భంగా అన్ అకాడమీ టాప్ ఎడ్యుకేటర్స్ విశిష్ట ప్యానెల్ పాల్గొని విద్యార్థులకు సిలబస్, పరీక్షల సరళి, అన్ అకాడమీ సమగ్ర అభ్యసన విధానాలను వివరించారు.ఈ సందర్భంగా ఎపిఐపిఇ 2024 పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన అన్ అకాడమీ విద్యార్థులు మధుసూధన్‌రెడ్డి, కెవిఎస్ విశ్వలను సత్కరించారు. అలాగే పరీక్షలో 97 శాతం కంటే ఎక్కువ, 99.15 పర్సంటైల్‌ను సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను అభినందించారు. 650కి మందికి పైగా నీట్, ఐఐటి, జెఇఇ సన్నద్ధత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రతినిధులు

మోడీకి బాబు, పవన్, జగన్ బానిసలు : కెఎ.పాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున విశాఖ ఎంపీగా, గాజువాక ఎమ్మెల్యేగా తాను పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ పాల్ అన్నారు. ఈ నెల 18న నామినేషన్ దాఖలు చేయనున్న తనను, ఓటర్లు ఆదరించి గెలిపించాలని కోరారు. బుధవారం రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'పాల్ రావాలి, పాలన మారాలి' నినాదంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి హెలికాప్టర్ గుర్తుకు బదులుగా కుండ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించిందన్నారు.

ఎపి, తెలంగాణలో ప్రధాని మోడీని వ్యతిరేకించే సత్తా తనకు మాత్రమే వుందన్నారు. ప్రధాని మోడీకి బానిసలు జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తోపాటు కెసిఆర్‌తో పోరాటం చేస్తున్నానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోర్టు ఉత్తర్వులు తెచ్చానన్నారు. రాష్ట్రంలో రెండు కులాలు, రెండు పార్టీలు ప్రజలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో తమ పార్టీ టికెట్స్ కోసం ఇప్పటివరకుమూడు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. సభల్లో రాళ్ల వేయించుకోవడం, కోడికత్తి వంటి డ్రామాలకు ఓట్లు వస్తాయని వైసిపి నేతలు భావిస్తున్నారని, ప్రజల్లో చైతన్యంతో వారి ఆటలు ఈసారి సాగవన్నారు. రైతులు,నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజల కన్నీరు తుడుస్తానని, వారికోసమే తాను బాబు, జగన్, పవన్‌లతో యుద్ధం చేస్తున్నాన్నారు.ఈ నెల 18న గురువారం ఉదయం విశాఖ ఎంపిగా, మధ్యాహ్నం గాజువాక ఎమ్మెల్యేగా నామినేషన్ వేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా ముంబాయికి చెందిన తన మిత్రుడు పంపిన పాల్ రావాలి, పాలన మారాలి ప్రచారగీతాన్ని విడుదల చేశారు. మీడియా సమావేశంలో పార్టీ నాయకులు యేసుపాదం, జీలకర్ర రవికుమార్ పాల్గొన్నారు.

హాల్ టికెట్లు నిలుపుదల చేయొద్దు

ప్రజాశక్తి-మధురవాడ : పాలిటెక్నిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫీజు బకాయిల పేరిట విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడం తగదని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం కళాశాలల యాజమాన్యాలను కోరారు. కొమ్మాదిలో ఒక ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాల హాల్‌టికెట్ కోసం విద్యార్థినిని ఇబ్బందికి గురిచేయడం, ఆమె తల్లి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వార్త మీడియాలో వచ్చిన నేపథ్యంలో వారు స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫీజు బకాయిల విషయంలో కళాశాలలు మానవతా దృక్పథంతో ఆలోచించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఇటువంటి ఇబ్బందులు ఎదురైతే మంగళగిరిలోని కమిషన్ కార్యాలయానికి ఫోన్ ద్వారా లేదా ఈ మెయిల్ apscpcr2018@gmail ద్వారా సమాచారం అందిస్తే చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన బుధవారం భీమిలి మండలం, తాళ్లవలసలో ప్రయివేట్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబాలకు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి జి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, ఇళ్లల్లోని వస్తువులను అల్మరాల్లో, షెల్ఫ్‌ల్లో సక్రమంగా ఉంచాలని సూచించారు. అగ్గి పెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఇతర మండే పదార్థాలను చిన్న పిల్లలకు అందుబాటులో ఉంచరాదన్నారు. వంటింటిలో వెలుతురు, గాలి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌ను ఐఎస్ఐ మార్కు గల రబ్బరు ట్యూబ్‌తో వెంటనే మార్చాలని సూచించారు.

స్వతంత్ర అభ్యర్థి నాగమణి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : భీమిలి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగోతు నాగమణి బుధవారం పద్మనాభం మండలంలోని మద్ది, బి.ఓ.పురం, విజయరాంపురం, గంధవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 20 ఏళ్లుగా పెత్తందారుల చేతుల్లో నియోజకవర్గం నడుస్తోందని, ఇప్పటికైనా స్థానిక అభ్యర్థులకే అవకాశం ఇవ్వాలని కోరారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 66వ వార్డు పరిధిలోని పలువురు వైసిపి నాయకులు బుధవారం టిడిపిలో చేరారు. 66వ వార్డు మహిళా అధ్యక్షులు ఎస్‌కె.ఆశాపర్వీన్, కాపు జెఎసి రాష్ట్ర మహిళా కన్వీనర్ కోరుకొండ పద్మ, సరోజిని, అనసూయ తదితరులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. వైసిపి పాలనలో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయ్యాయన్నారు. పాలన దోపిడీమయంగా మారిందని, ప్రశ్నించే గొంతులను నొక్కడమే పనిగా వైసిపి నేతలు పెట్టుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోమాడ వాసు, సింగూరు అనంత్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో పొంగుతున్న కాలువ

కంపుకొడుతున్న వీధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి శ్రీలాసుందరయ్యనగర్‌లోని వీధి ప్రధాన కాలువ మురుగుతో పొంగుతోంది. దుర్గంధం వ్యాపించి వీధి అంతా కంపుకొడుతోంది. ఇదే పరిస్థితి కొన్ని నెలల నుంచి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దుర్గంధంతో పాటు దోమలు, ఈగలు అధికంగా ప్రబలడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆరిలోవ సిపిఎం ఆఫీసు నుంచి సుమారు 150 మీటర్ల పొడవు వరకు సాగే ఈ ప్రధాన కాలువపై పూర్తిగా పలకలతో కప్పేశారు. ఎవరి ఇంటి వద్ద వారు ఎటువంటి అనుమతులు లేకుండా కాలువపై పలకలతో కప్పేశారు. కాలువ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయింది. పలకలతో కప్పేయడంతో కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో కాలువ పూర్తిగా మురుగుతో ఉప్పొంగుతోంది. వర్షం పడితే నీరు పోయే మార్గం లేక కాలువలు పొంగి ఇళ్లలోకి, రోడ్డుపైకి మురుగు నీరు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలపై వేసిన పలకలు తొలగించి కాలువలో పేరుకుపోయిన చెత్తను, శిథిలాలను తొలగించి మురుగు నీరు సజావుగా పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు

తోట త్రిమూర్తులను అనర్హులుగా ప్రకటించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో శిక్ష పడిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని విరసం ఐక్య వేదిక రాష్ట్ర కౌన్సిల్ కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రేసపువానిపాలెంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తోట త్రిమూర్తులపై ఐదు సెకన్ల కింద నేరం రుజువు అయిందని తెలిపారు. తీవ్ర నేరం జరిగితే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని గుర్తు చేశారు. అయితే కోర్టు ఇచ్చిన తీర్పు నిరాశ, నిస్పృహ రీతిలో ఉందని అభిప్రాయపడ్డారు. నిందితుడికి నేరం నుంచి ఊరట కలిగించే విధంగా తీర్పు ఉందని, తీర్పును పున్ణ సమీక్షించాలని కోరారు. త్రిమూర్తులకు టికెట్ ఇచ్చిన జగన్ పట్ల కూడా దళితులు అనుకూలంగా లేరని, వెంటనే ఆయన దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ శిరోముండనం వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన విలేకరి రాజుకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

విరసం కో -కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటంతో వచ్చిన తీర్పు సంతప్తి కరంగా లేదన్నారు. దళిత నాయకుడు కె.చిన్నారావు మాట్లాడుతూ, సామాజిక న్యాయం అంటున్న జగన్ ఆత్మ గౌరవానికి భంగం కల్గించిన త్రిమూర్తులను ఎన్నికల బరి నుంచి తప్పించాలని కోరారు. సమావేశంలో విరసం నేతలు సుధాకర్, ఓంకార్, త్రినాథ్, రాజేంద్ర ప్రసాద్, ఈశ్వరరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో వైసిపి ప్రచారం



వైసిపిలోకి ఆహ్వానిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి రెల్లివీధి, బిటిఆర్.కాలనీ, అమ్మవారి గుడి ప్రాంతాల్లో వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని చూసి ఓటువేయాలని వైసిపి కార్పొరేటర్ సారిపల్లి గోవిందు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్మిల నవీన్ రాజు, చుక్క అనిల్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్లు సానబోయిన సురేష్, పోతిబంతి హరికష్ణ, బొమ్మాళి రవి, గోవిందమ్మ, పద్మ, సంధ్య, వీరమ్మ, జయ,అప్పన్న, గౌరీ నాయుడు, సన్నీ, జగన్ పాల్గొన్నారు.

46వ వార్డులో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

53వ వార్డులో ప్రచారం

జివిఎంసి 53వ వార్డు పరిధి గ్రీన్ గార్డెన్స్, హుస్సేన్ నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యాన కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో ఆయా ప్రాంతానికి చెందిన పలువురు కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ సంక్షేమ వారధిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిలుస్తారన్నారు. సంక్షేమాన్ని ఆదరిస్తూ తమ అమూల్యమైన ఓటు హక్కును ఫ్యాన్ గుర్తుపై వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, అమర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-పెందుర్తి : నరవ విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు చెన్నైకు చెందిన విప్రో ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యాన క్యాంపస్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. 32 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.1.92లక్షలు ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, ప్లేస్ మెంట్ ఆఫీసర్ తులసినాయుడు అభినందించారు.

97వ వార్డులో గుంటూరు ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముషిడివాడ శాంతినగర్‌లో బుధవారం పెందుర్తి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి గుంటూరు నరసింహమూర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గానికి ఎంతోమంది వస్తారు.. వెళ్లిపోతారు, కానీ తాను ఇక్కడే పుట్టి పెరిగానని, ఈ కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ద్రోణంరాజు సత్యనారాయణతో ఉన్న సంబంధాలను కాలనీవాసులకు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నరసింహమూర్తి సతీమణి భారతి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరో యువకుడు గాయపడ్డాడు. అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధి చటకంబ గ్రామానికి చెందిన సోకిలి నాగరాజు (28), మామిడి రవి (20), మరో యువకుడు బుధవారం ద్విచక్ర వాహనంపై పినకోట నుండి దేవరాపల్లి వస్తున్నారు. ఈ నేపథ్యంలో పెదకోట పంచాయతీ కేంద్ర సమీపంలో బైక్ అదుపుతప్పడంతో చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సోకిలి నాగరాజు, మామిడి రవి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-చీడికాడ,బుచ్చయ్యపేట:చీడికాడ మండలం పెద్దగోగాడ గ్రామ శివారులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి చెందాడు. బుచ్చయ్యపేట మండలం పైడిభీమవరం గ్రామానికి చెందిన పడాల వరహాలు (32) తన అత్తవారి గ్రామమైన దేవరాపల్లి మండల వాకపల్లి గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. మార్గ మధ్యలో పెద్ద గోగాడ గ్రామ శివారులో బైక్ గెడ్డలో ప్రమాదవశాత్తు పడి మరణించి ఉండవచ్చుని చీడికాడ ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ ఘటనను స్థానికులు చూసి సుమారు నాలుగు గంటలకి సమాచారం అందించగా సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేశామన్నారు. వరహాలు మృతితో బుచ్చయ్యపేట మండలం పి.భీమవరంలో విషాదం అలుముకుంది. మృతుడు 15 ఏళ్ల క్రితం ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు.రెండు రోజుల క్రితం కుమారుని పుట్టి వెంట్రుకలు తీయించడానికి వచ్చి మృతి చెందటంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏటిగైరంపేట పంచాయతీ సీతకండి గ్రామ శివారులో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసినట్లు గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 1300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కితంపేట గ్రామ శివారు సమీప తోటలో బుధవారం మధ్యాహ్నం జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు రూ.8.150ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. గత కొన్ని రోజులుగా కిత్తంపేట గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నం సిబ్బందితో దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు జూదం ఆడుతూ పట్టు పడ్డారని, వారి నుంచి నగదుతో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... జివిఎంసి 8వ వార్డు పరిధిలోని తారకరామ్‌నగర్‌కు చెందిన జోష్నారెడ్డి హైదరాబాదులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్‌లో ఉన్నారు. మంగళవారం ఉదయం బయటికి వెళ్లిన జోష్నారెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేదు. ఈ క్రమంలో ఇంట్లో ఒక లేఖ దొరికింది. అందులో తన గురించి వెతకొద్దు అని రాసి ఉంది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రి 33/11 కెవి సబ్‌స్టేషన్, బోడమెట్టపాలెం 11కె వి సబ్ స్టేషన్ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ జోన్ 3 ఆపరేషన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లుపేట, దానరిపేట, ముద్దాడపేట, రామునాయుడుపేట, బోడమెట్టపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
గురువారం
18 ఏప్రిల్ 2024

కలం మాట



ఓటంటే సిరా చుక్క కాదు..!



ఒక్కసారి ఆలోచించు
నీ కోసం సేవ చేసినది ఎవరో
నిన్ను ఏమార్చినది ఎవరో తెలుస్తుంది
తెలివిగా అడుగెయ్యి
తలయెత్తుకు నడిచేలా ప్రవర్తించు
మన కోసం
శ్రమించే వారి గెలుపు కోసం
నీ ఓటుహక్కు వినియోగించు
పక్కదారి పట్టకుండా
పవిత్రమైన ఓటుహక్కు పంచు
అందరి బాగుకై నినదించు
మంచికై కదలరా
మలినాలను కడగరా
మంచికి గొడుగై నిలిచి
సమత, మమత పెంచరా

కులానికి
మతానికి బానిస కావద్దు
మనమంతా భారతీయులం
భరతమాత బిడ్డలం
మన దేశానికి సేవ చేసిన వాడే
నిజమైన నాయకుడు
ధనబలం, కండబలం
చూసి మోసపోకుమా
గుండె బలంతో మన మధ్య
ఐక్యత పెంచే వారినే ఎన్నుకుందాం
మన గ్రామానికి, మన ప్రాంతానికి
ఏమి కావాలో, ఏమి చేయాలో
తెలిసిన వానినే ఎన్నుకుందాం
ఓటంటే... వేలికి అంటే సిరాచుక్క కాదు
మన రాతల్ని మార్చు వేగుచుక్క

-సీతా సతీష్, కవి, మాడుగుల,.





అందరినీ నమ్మడం
లేదా...
ఎవరినీ నమ్మకపోవడం,
రెండూ..
ప్రమాదకరమే.
- అబ్రహం లింకన్

వైసిపి అభ్యర్థి భరత్‌కుమార్ ప్రచారం



ఇంటింటా ప్రచారంలో అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని కోడూరు పంచాయతీ పరిధి మర్రిపాలెం గ్రామంలో వైసిపి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసార భరత్ కుమార్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, అసెంబ్లీ అభ్యర్థిగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొసిరెడ్డి పైడిరాజు, నాయకులు పల్ల వెంకట అప్పారావు, ఎన్.శ్రీనివాసరావు, ఆర్ ప్రసాద్, వనం సోమనాయుడు, రొంగలి సత్తిబాబు, పల్లా అప్పలనాయుడు, పల్లా చల్లారావు, నాగులపల్లి శ్రీనివాసరావు, లింగం శ్రీను, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



దక్షిణం ... కాలుష్య కాసారం.

విశాఖ నగరంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గం దక్షిణం. దీనికి గొప్ప చరిత్ర ఉంది. బ్రిటిష్ వారు, డచ్చివారు ఇక్కడ సాగర తీరం నుంచే తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించారు. తమ పరిపాలనా సౌలభ్యం కోసం అద్భుత కట్టడాలు నిర్మించారు. ఇప్పుడు అవి కలెక్టర్ కార్యాలయం, కెజిహెచ్, టౌన్ హాలుగా మారాయి. రాజకీయ దిగ్గజాలు ఇక్కడ నుంచి శాసనసభకు వెళ్లారు. స్వాతంత్ర్య పోరాట యోధునిగా ఖ్యాతి పొందిన తెన్నేటి విశ్వనాథం, మచ్చలేని రాజకీయ నాయకునిగా పేరుగాంచిన అంకితం వెంకట భానోజీరావు, ద్రోణంరాజు సత్యనారాయణ వంటి నాయకులు ఈ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. శాసనసభలో తమ సత్తా చూపించారు. ఇవన్నీ ఈ నియోజకవర్గ చరిత్రను నేటి తరానికి తెలియచేస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గంలో దశాబ్దాలు గడిచినా కొన్ని ప్రధాన సమస్యలు అలానే ఉన్నాయి. వాటిలో కాలుష్యం ప్రధానమైనది.

(ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్)

- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం చూపని పాలకులు
- సార్వత్రిక ఎన్నికల్లో ప్రభావం చూపనున్న అంశం

విశాఖపట్నం పోర్టును ఆనుకుని దక్షిణ నియోజకవర్గం ఉంది. దీంతో అనివార్యంగా కాలుష్య సమస్య తలెత్తుతోంది. పోర్టు లోడింగ్, అన్ లోడింగ్‌తో కాలుష్యం అధికంగా ఉంటోంది. ఇక్కడి కాలుష్య నివారణకు ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలు జరగలేదు. పలుచోట్ల రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. ఈనాటికీ అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఇటీవల మెయిన్ రోడ్డును 60 అడుగులమేర విస్తరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఎన్నికల్లోనూ కాలుష్య సమస్య తెరపైకి రావడం, తాము విజయం సాధిస్తే కాలుష్యం లేకుండా చేస్తామని నాయకులు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఈసారి పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు కాలుష్య నివారణపై తమ ప్రచారంలో ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆశ్చర్యం కలుగుతోంది. కాలుష్యం వల్ల ఈ నియోజకవర్గ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించడానికి ఎటువంటి చొరవా చూపలేదు. నియోజవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల్లో అల్లిపురం వెంకటేశ్వర మెట్ట నివాసితుల సమస్య కూడా ఉంది. అల్లిపురం బలిగిరి వెంకటేశ్వర స్వామి ఆలయం చుట్టుపక్కల 1450 సర్వే నెంబర్ పరిధిలో మూడు ఎకరాల స్థలం ఉంది. అది దేవాదాయ శాఖకు చెందినదని అధికారులు 2019 నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. దీంతో స్థానికులు పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి అవసరాలకు ఇళ్లను అమ్ముకోవటానికి రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఇంటి నిర్మాణానికి పాత ఇంటిని కూల్చివేస్తే ఆ స్థలంలో దేవాదాయ శాఖ అధికారులు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఆలయం చుట్టూ పదుల సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలలో బోర్డులే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా స్థలాలు వ్యర్థాలతో నిండిపోయాయి. 1450 సర్వే నెంబర్ పరిధిలో ఉంటున్న సుమారు 2500 కుటుంబాలు పక్కా రిజిస్టర్ డాక్యుమెంట్లు లేక ఇబ్బందులు పడుతున్నాయి. వందేళ్ల నుంచి ఇక్కడే నివసిస్తున్న తమకు న్యాయం చేయాలని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఈ అంశం ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకప్పుడు అంతర్జాతీయ కీర్తి ప్రతిష్టలు సంతరించుకున్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం దయనీయ స్థితిలో ఉంది. శిథిలావస్థకు చేరుకుంది. మందుబాబులకు నిలయంగా మారింది. ఈ నియోజకవర్గంలో మత్స్యకారులు అధికం. వారి సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపలేదన్న విమర్శలున్నాయి.

ప్రస్తుత అభ్యర్థులు వీరే..

వైసిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్ కుమార్ బరిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయనే నియోజకవర్గ ఎమ్మెల్యే. కూటమి నుంచి జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి వాసుపల్లి సంతోష్ పోటీలో ఉన్నారు.



వాసుపల్లి గణేష్‌కుమార్ | వాసుపల్లి సంతోష్ | వంశీకృష్ణశ్రీనివాస్



కాంగ్రెస్ ఆధిపత్యం

దక్షిణ నియోజక వర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని ప్రకటించింది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు ఉప ఎన్నికలతో పాటు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఆరుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. తెలుగుదేశం అభ్యర్థులు ఐదుసార్లు, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, భారతీయ జనతాపార్టీ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు తెన్నేటి విశ్వనాథం ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైన తొలి శాసనసభ్యునిగా గుర్తింపు పొందారు. అనంతరం ఏర్పడ్డ మంత్రివర్గంలో ఆయన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1978లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన ఎస్.అళ్వార్‌దాసు కూడా కొంతకాలం మంత్రిగా పనిచేశారు. 1972లో ఇక్కడి నుంచి నెగ్గిన ఎంఆర్.డీన్‌తో పాటు 1994లో నెగ్గిన ఎస్‌కె.రెహమాన్ ముస్లింలుగా చట్టసభలలో పనిచేశారు. ఇక్కడ నుంచి శాసనసభ్యునిగా ఎన్నికైన డాక్టర్ కె.హరిబాబు ప్రస్తుతం మిజోరాం గవర్నర్‌గా ఉన్నారు.

నియోజకవర్గ చరిత్ర ఇదీ..

మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి ఆంధ్రప్రదేశ్ వేరుపడిన తరువాత 1952లో విశాఖపట్నం నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు విశాఖ నియోజక వర్గం ఓటర్లు 68,284 మంది. విశాఖపట్నం నియోజకవర్గం పునర్విభజన పిదప 1967లో విశాఖ-1, విశాఖ-2 నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. 2009లో మరోసారి శాసనసభా నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. విశాఖ - 1 నియోజకవర్గం కొన్ని మార్పులతో విశాఖ దక్షిణ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఈ నియోజకవర్గంలో 27, 29, 30 నుంచి 39, 41, 42 వార్డులు చేరి ఉన్నాయి. ఈ నియోజక వర్గంలో సంఖ్యా బలంలో మత్స్యకారులదే పైచేయి. నియోజకవర్గంలో ఎక్కువ భాగం సాగరతీరంలో ఉండటంతో ఆయా ప్రాంతాల్లో మత్స్యకారులు అధికంగా ఉన్నారు. తరువాత ముస్లిం ఓటర్లు ఉన్నారు. వారి తర్వాత బ్రాహ్మణులు, యాదవులు, ఎస్సీలు, విశ్వబ్రాహ్మణులు, క్రైస్తవులు ఉన్నారు. ఈ నియోజకవర్గం ఒకప్పుడు ఉద్యమాలకు వేదికగా నిలిచింది. ఉప్పు సత్యాగ్రహం, సిపాయిల తిరుగుబాటు ఇక్కడ జరిగాయి. తెన్నేటి విశ్వనాథం, అంకితం వెంకట భానోజీరావు, భాట్టం శ్రీరామమూర్తి, వై.విజయకుమార్ వంటి నాయకులు ఇక్కడ నుంచే శాసన సభకు పోటీ చేశారు. భాట్టం శ్రీరామమూర్తి మాత్రం గెలవలేదు. ముగ్గురు మహిళలను, ఇద్దరు ముస్లింలను శాసనసభకు పంపిన ప్రత్యేకత ఈ నియోజకవర్గానిది. జగదాంబ జంక్షన్, పూర్ణా మార్కెట్, డాబాగార్డెన్స్ వంటి ముఖ్యమైన వ్యాపార కేంద్రాలు ఇక్కడే ఉన్నాయి. ఫిషింగ్ హార్బర్‌తో వేలాది మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తోంది. సినిమా థియేటర్లు అధికంగా ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి.



విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ విశాఖ లోక్‌సభ అభ్యర్థి సత్యారెడ్డి

ఇండియా వేదికతో ప్రజాస్వామ్య పరిరక్షణ

- కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా వేదిక అధికారంలోకి రావడం ద్వారానే దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకో గలమని కాంగ్రెస్ పార్టీ విశాఖ లోక్‌సభ అభ్యర్థి సత్యారెడ్డి అన్నారు. బుధవారంభీమిలి మండలం తాళ్లవలసలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్.రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్నప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరిగాయన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపితో వైసిపి, టిడిపి, జనసేన అంటకాగుతున్నాయని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను చిత్తుగా ఓడించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

భీమిలి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మరాజు (హాసినివర్మ) మాట్లాడుతూ, గతంలో ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ప్రాతినిధ్యం వహించిన స్థానికేతరులైన గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ ప్రాంత అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. స్థానికుడిని అయిన తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామ్యం, లౌకిక, గణతంత్ర సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం ఉనికి బిజెపి పాలనలో ప్రమాదంలో పడిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా వేదిక తరపున బరిలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.గోవింద, పిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అటో ప్రచారాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి వర్మ రాజు జెండా ఊపి ప్రారంభించారు.

కాంగ్రెస్‌కు ప్రజాదరణ

విశాఖ కలెక్టరేట్: కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో విజయంతో పూర్వవైభవం ఖాయమని ఆ పార్టీ విశాఖ ఎంపి అభ్యర్థి పి.సత్యారెడ్డి, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి సంతోష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ సాధ్యమని గుర్తించిన ప్రజలు ఆ పార్టీని కోరుకుంటున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని, ప్రస్తుతం వైఎస్ఆర్ తనయ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌తోపాటు రాష్ట్రం పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. షర్మిలారెడ్డిపై అవాకులు, చెవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వాసుపల్లి సంతోష్ మాట్లాడుతూ,.దక్షిణ ప్రజలు స్థానికేతరులకు తగిన బుద్ధి చెప్పి, స్థానికుడినైన తనను గెలిపించాలని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు, మాడుగుల సత్యనారాయణ, జెటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో నిలవండి

- ఉత్తరాంధ్ర మేనిఫెస్టో విడుదల
- పోటీ అభ్యర్థుల వైఖరి స్పష్టం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక డిమాండ్



ఉత్తరాంధ్ర మేనిఫెస్టో విడుదల చేస్తున్న అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ, కుమార మంగళం

ప్రజాశక్తి- కలెక్టరేట్ : ప్రస్తుత ఎన్నికల్లో వివిధ పార్టీల పోటీ అభ్యర్థులు, గెలిచిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, కెఎం.కుమార మంగళం డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశంలో 'ఉత్తరాంధ్ర మ్యానిఫెస్టో'ను విడుదల చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రణాళికలను ఈ మానిఫెస్టోలో వేదిక వెల్లడించింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, అపారమైన వనరులున్న ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి ప్రధాన కారణం పాలకులు నిర్లక్ష్యమే తప్ప, మరొకటి కాదన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి కాకుండా, వ్యక్తిగత స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం అత్యంత విచారకరమన్నారు.గడచిన పదేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందకుండా పాలకులు అవకాశవాదం ప్రదర్శించారని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర విభజన చట్టం అమలుకు నోచుకోకపోవడం వల్లే ఈ పదేళ్ల కాలంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి నోచుకోక, మరింత వెనుకబాటులోకి నెట్టబడిందన్నారు. ఇది చాలదన్నట్లు కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కుగా ఖ్యాతిగాంచిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని నిర్ణయించిందన్నారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో ఉత్తరాంధ్రలో విస్తారంగా ఉన్న అటవీ భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసి, గిరిజనులను రోడ్లమీదకు నెట్టాలని చూస్తోందని విమర్శించారు. సముద్రంతో సహా సహజ వనరులన్నింటినీ కార్పొరేట్‌వరం చేస్తోందన్నారు.

రాష్ట్రం, ఈ ప్రాంత అభివద్ధికి కట్టుబడాల్సిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ పని చేయకపోగా, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపితో జతకట్టాయన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపికి సహకరించేలా రాష్ట్రంలోని అధికార వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అందువల్ల రాష్ట్రంలోని ఈ మూడు ప్రధాన పార్టీల అవకాశవాదాన్ని ఎండగట్టి, ప్రత్యామ్నాయం వైపు ప్రజల ఆలోచించాలని కోరారు. రాష్ట్రం, ఉత్తరాంధ్ర అభివృద్ధి, స్టీల్ ప్లాంట్ రక్షణకు నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కింది ప్రధాన డిమాండ్లపై త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వైఖరి తెలపాలని కోరారు. నీటి ప్రాజక్టుల నిర్మాణం, స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపివేత, ప్రభుత్వ రంగ బలోపేతం,పర్యావరణ పరిరక్షణ, గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం పటిష్ట అమలు, జిఒ 3కు చట్టబద్ధత, ప్రభుత్వ విద్య, వైద్యం పటిష్టత, మౌలిక వసతుల కల్పన, రాష్ట్ర విభజనహామీ చట్టం అమలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై తమ వైఖరి స్పష్టం చేయాలని, వీటి సాధనకు కృషి చేయాలని కోరారు.

కొనసాగుతున్న ఎంవివి ప్రచారం



స్థానిక నాయకులతో వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పేదోడి తలరాత బాగుండాలన్నా, అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా జగన్మోహన్‌రెడ్డి పాలనతోనే సాధ్యమని వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ అన్నారు. బుధవారం 91వరోజు పెదజాలరిపేట నుంచి వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్‌తో కలిసి పాదయాత్ర కొనసాగించారు. వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌కు అండగా నిలవాలని, తూర్పు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పివి నారాయణ,వాడమోదుల గణేష్, పార్టీ శ్రేణులు, మహిళలు. వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్యాస్ ఫైర్ అయినప్పుడు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై సబ్బవరం పంచాయతీ పరిధి బుడగ జంగాల కాలనీ, రెల్లి కాలనీ ప్రాంతాల్లో అగ్ని మాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జివి సత్యరాజు నివాసాలలో అగ్ని ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వంట చేస్తున్నప్పుడు గ్యాస్ లీక్ అయ్యి అగ్ని ప్రమాదం జరిగితే ఏ విధంగా నివారించాలో తెలియజేశారు. విద్యుత్ ఉపకరణాలు వినియోగిస్తున్నప్పుడు అగ్ని ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.అప్పలనాయుడు, పి.అప్పారావు, టి.వెంకట్రావు, బి.ఉదయ్ కుమార్, సిహెచ్.ఎ.బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి పథకం మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం అచ్చర్లలోని దళిత కాలనీలో తాగునీటి పథకం మోటారుకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఈ కాలనీలో తాగునీటి పథకం మోటారు ఆరు రోజుల క్రితం కాలిపోయింది. దీంతో ఈ కాలంలో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడ్డారు. పొలంలో ఉన్న మోటారు దగ్గర నీటిని పట్టుకొని తీసుకొచ్చి దానిని ఉపయోగించేవారు. దీంతో గ్రామీణ తాగునీటి సరఫరా సిబ్బంది బుధవారం మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు మాట్లాడుతూ పైప్‌లైన్ వల్ల మోటారు కాలిపోయినట్లు చెప్పారు.

మండల కేంద్రంలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతపురం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. 220 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో సమస్య ఏర్పడింది. రాత్రి 7.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. వేసవి కావడంతో ప్రతి ఒక్కరు ఏసీలు ఫ్యాన్లు చెంతన ఉంటున్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో ఏసీలు ఫ్యాన్‌ల పనిచేయక వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాజెక్టులు ఉపయోగకరంగా ఉండాలి

ప్రజాశక్తి-కశింకోట : ప్రాజెక్టులు ఉపయోగకరంగా ఉండాలని జిల్లా కోఆర్డినేటర్ రూపవతి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తున్న ఎటిఎల్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఇందులో పాల్గొన్న రూపవతి మాట్టాడారు. ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గ్రేస్, ఏటిఎల్ ఇన్‌ఛార్జ్ కె.అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-కశింకోట : ఎన్నికల నేపథ్యంలో కశింకోట మండలం తాళ్లపాలెం సంత వద్ద పోలీసులు బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. డబ్బులు, ఇతర వస్తువులు తరలిపోకుండా రోజు ఉదయము 6 నుండి 7 గంటల వరకు సాయంత్రం 4 తరువాత వెళ్లి వచ్చి వాహనం తనిఖీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో కశింకోట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

గమ్మత్తు చేరికలు

గందరగోళంలో ప్రజలు



ప్రజాశక్తి-చోడవరం : రాజకీయ పార్టీల్లో చేరికలు గతానికి భిన్నంగా జరుగుతున్నాయి. గమ్మత్తు చేరికల వల్ల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. చోడవరం పట్టణంలో టిడిపి బలంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పి తమ పార్టీలో చేరికలు జరిగినట్లు మీడియా ముందు ఉంచుతున్నారు. దీనికి తీసుపోదు అన్నట్లుగా వైసిపి కూడా అలాగే వ్యవహరిస్తుంది. మరో వైపు తమతో ప్రచారానికి వచ్చే వారికి సైతం కండువాలు వేసి చేరికలు చూపిస్తున్నారు. ఇరు పార్టీలు వద్ద మొహమాటం తోసి వేయలేక నాయకులు వేస్తున్న కండువాలకు పార్టీలు కూడా చూడకుండా డూడూ బసవన్నలా ప్రజలు మెడలు ఉంచుతున్నారు. చిత్రం ఏమిటంటే టిడిపి, వైసిపి పార్టీల కండువాలు కప్పుకున్న వారు గంటల వ్యవధిలోనే కండువాలు మారుస్తూ వాటిని వేసిన నాయకులకు చుక్కలు చూపిస్తున్నారు.

గతంలో ఎన్నికల ప్రచారానికి, ప్రస్తుతం చేస్తున్న ప్రచారానికి తేడాలు కనబడుతున్నాయి. గతంలో ప్రచారం చేసుకుంటూ వెళ్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థించేవారు. ప్రస్తుతం అలా కాకుండా ప్రచారం వెంబడే కండువాలను తీసుకువెళ్లి, ప్రజలకు సమ్మతం ఉన్నా లేకపోయినా వారి మెడల్లో వేసేస్తున్నారు. దీంతో కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపమన్న చందంగా చోడవరం ఓటర్ పరిస్థితి తయారైంది. పార్టీలు ఓట్లు సంపాదించుకునే కంటే తమ పార్టీలో ఉన్నవారు పక్క చూపులు చూడకుండా నిరంతరం కండువాలు బాగోతం నడుస్తుంది. ఈ సారి వినూత్నంగా వెనక తిరిగిన తమ పార్టీల అనుయాయులకు రోజువారీ ఖర్చులు కింద సాయంత్రానికి కొంత ముట్టజెప్పవలసి వస్తుందని నాయకులు వాపోతున్నారు. ఈ పార్టీల కూడికలు తీసివేతల వల్ల ఏమాత్రం ప్రయోజనం ఉండదని, ఎలక్షన్ ముందు రోజు ఏ పార్టీ అయితే ప్రజలను బాగా ఆకట్టుకుంటుందో వారికే ఎన్నిక అనుకూలంగా జరిగే పరిస్థితులు ఉంటాయని, కండువా వేసుకున్నవారంతా తమ పార్టీ వారే అనుకుంటే పప్పులో కాలేసినట్లేనని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

పుత్ర శోకం

అనారోగ్యంతో ఒక్కగానొక్క కొడుకు మృతి
కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

నిండు నూరేళ్ళు బతకాల్సిన పిల్లలు యుక్త వయస్సులోనే మృత్యువాత పడితే ఆ తల్లిదండ్రులకు కలిగే పుత్ర శోకం ఎవరూ తీర్చలేనిది. ఇంకొన్ని రోజుల్లో చదువు ముగించుకొని ఇంటికొస్తాడుకున్న కుమారుడు అనారోగ్యంతో చనిపోవడంతో మండలంలోని నాగయ్యపేట పంచాయతీ సీతంపేట గ్రామానికి చెందిన ఓ అన్నదాత కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది.



అర్జునరావు (ఫైల్‌ఫొటో)

స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... సీతంపేట గ్రామానికి చెందిన గొర్లె సింహాచలం నాయుడు, గైరమ్మ దంపతుల ఒక్కగానొక్క కొడుకు అర్జునరావు(20) విశాఖపట్నంలోని కృష్ణ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అర్జునరావు ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో కొంతమంది స్నేహితులు ఆసుపత్రికి తీసుకెళ్లగా మెదడులో రక్తనాళాలు గెడ్డ కట్టినట్లు వైద్యులు తెలియజేశారు. దీంతో మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తీసుకెళ్లగా, వారం రోజుల కిందట వైద్యులు మెదడు ఎడమవైపు భాగాన శాస్త్ర చికిత్స చేశారు. రక్తస్రావం పెరగడంతో రెండోసారి ఆపరేషన్ నిర్వహించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి బుధవారం ఉదయం 10 గంటలకు అర్జునరావు మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరయ్యారు. అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయా అంటూ తల్లిదండ్రులు కుమారుడి మృత దేహంపై పడి బోరును విలపించారు. వారిని చూసిన ప్రతి ఒక్కరూ ఇలాంటి పరిస్థితి పగవారికి కూడా రాకూడదంటూ బాధపడ్డారు.

వడ్డాది పంచాయతీలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామపంచాయతీలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని ఆ పంచాయతీ వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. వడ్డాదిలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండ లలిత, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, వైసిపి నాయకులు అచ్చం నాయుడుతో కలిసి వార్డు సభ్యులు మాట్లాడారు. పంచాయితీలో తమకు ఇచ్చిన ఎజెండాకు, తీర్మానాలకు తేడాలు ఉంటే సర్పంచ్, ఉప సర్పంచ్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. గెలిచిన 13 మంది వార్డు సభ్యుల్లో 12 మంది వైసీపీలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. వైసిపి వలన పదవుల పొందిన సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావుకు నైతిక విలువలుంటే తమ పదవులకు రాజీనామా చేయాలని కోరారు. ఉప సర్పంచ్ సూర్య నాగేశ్వరరావు తమ వార్డు సభ్యులను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయని జడ్పీటీసీ రాంబాబు హెచ్చరించారు. గత ఎన్నికల కంటే ఈసారి తమకు అత్యధిక మెజారిటీ లభిస్తుందని దొండ నారాయణ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అడపా వరహాలు బాబు, గరికిపాటి బాలాజీ, జి.వెంకటలక్ష్మి సిహెచ్.రమణ, ఇంటి రాజేశ్వరి, మామిడి చిన్నమ్మలు, ఉల్లి భవాని, బి.మాణిక్యం, జి.ప్రసాద్, బి.పార్వతి, బి.లక్ష్మి, వి వరలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పులపాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అనకాపల్లి అసెంబ్లీ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆరోపించారు. మండలంలోని మార్టూరు, మాకవరం గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, టిడిపి నేత దాడి రత్నాకర్‌తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ గడిచిన ఐదు ఏళ్లలో అక్రమ మైనింగ్ చేస్తూ గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఇటువంటి మాఫియాను తుదముట్టిస్తారన్నారు. రానున్న ఎన్నికలలో గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్టూరు, మాకవరం గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతుగా జబర్దస్త్ ఆర్టిస్టుల ప్రచారం

అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బిజెపి అభ్యర్థి సీఎం.రమేష్‌కు మద్దతుగా జివిఎంసి 82వ వార్డు విజయరామరాజు పేటలో జబర్దస్త్ ఆర్టిస్టులు గెటప్ శ్రీను, ఆటో రాంప్రసాద్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎల్లంకి సత్తిబాబు, పోలరపు త్రినాథ్, పిట్ల రాజు, దాడి జగన్, ఎల్లంకి సతీష్, ఎస్. భానుచందర్ (అఖి), పేకేటి రమేష్, షేక్ రియాజ్, ముప్పిడి మణికంఠ, మరియు చరణ్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



రాంప్రసాద్, గెటప్ శ్రీనును సత్కరిస్తున్న జనసేన నేతలు

వైసిపిలో యువకులు చేరిక

ప్రజాశక్తి - కశింకోట

మండలంలోని నర్సింగబిల్లి గ్రామనికి చెందిన యువకులు అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో ఏఎస్ పేటలోని ఆయన నివాసం వద్ద బుధవారం వైసిపిలో చేరారు. నర్సింగబిల్లి గ్రామనికి చెందిన మొత్తుకూరి రాజు, శివరాత్రి లింగాలు, శివరాత్రి ఈశ్వరరావు, మోతి చంటయ్య, మోతి గుర్రప్ప, మోతి మాణిక్యం, శివరాత్రి నూకరాజు, శివరాత్రి రాజప్పారావు, శివరాత్రి కొండయ్య, మోతి శ్రీను, కళ్యాణి రాజు తదితరులకు పార్టీ కండువాలు వేసి వైసీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు వైసీపీకి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, గ్రామ సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు, నాయకులు కోన సోము నాయుడు, ఉపసర్పంచ్ సేనాపతి నారాయణరావు, రాజాన విజయ్ కుమార్, కట్టుమూరు చంద్రశేఖర్, రాజాన నాగేశ్వరరావు, శివరాత్రి నూకరాజు, ఊడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యంగా ఉండొచ్చు

ప్రజాశక్తి-అనకాపల్లి

యోగతో సర్వరోగలను నివారించుకోవచ్చని, అన్ని వయసులో వారు ఆరోగ్యంగా ఉండాలంటే యోగ క్రమం తప్పకుండా చేయాలని యోగా మాస్టర్ ట్రైనీ కృష్ణశ్రీ అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో నిర్వహిస్తున్న యోగ సహ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శ్వాసను, శరీరాన్ని నియంత్రించడంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుందని చెప్పారు. శరీరంలోని ప్రతి కండరాన్ని, కణజాలాన్ని విస్తరించడమే కాకుండా అవయువాలను అంతర్గతంగా మసాజ్ చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సాత్విక ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం యోగ గురు కష్ణశ్రీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాజిగ్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి బిఎస్ఎంకె జోగి నాయడు, బుద్ధ కాశీ విశ్వనాథ్, బీమరశెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి- అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులను నమ్మించి తీరని అన్యాయం చేశారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున విజయవాడలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని 2017 మార్చి 23న జగన్మోహన్ రెడ్డి సందర్శించి తనకి అధికారం వచ్చిన వారం రోజుల్లోగా అగ్రిగోల్డ్ బాధితులకు ప్రతి పైసా పువ్వుల్లో పెట్టి అందచేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఉత్తరాంధ్ర నుండి సుమారు 6 లక్షల మంది ఉన్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటన చేయాలని భీశెట్టి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ పౌరవేదిక అధ్యక్షుడు కొలసాని రమణ, కనుబుడ్డి నరసింగరావు, కెఎమ్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

ప్రారంభించి వినియోగం మరిచిన వైనం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రానికి సమీపంలోని లింగాపురం కూడలి వద్ద పంచాయతీ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గతేడాది ప్రారంభించారు. నేటికీ దానిని వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో వృధాగా పడి ఉంది. మండల కేంద్రానికి సమీపంలో ఉండటంతో షాపింగ్ కాంప్లెక్స్‌కు డిమాండ్ ఉన్నా వినియోగంలోకి తీసుకు రాకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు షాపులు వినియోగంలోకి తీసుకు వచ్చినట్లయితే ఒక్కో షాపుకు కనీసం రూ.1500 వరకు అద్దె వచ్చేది. గతేడాది 11వ నెలలో ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ సుమారు 14 దుకాణాల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే వినియోగంలోకి తీసుకొచ్చినట్లయితే ప్రతినెలా సుమారు రూ.20వేల ఆదాయం వచ్చేది. వినియోగంలో లేక షాపింగ్ కాంప్లెక్స్ దెబ్బతినే అవకాశం ఉంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి వృధాగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న బాబూరావు (ఫైల్‌ఫోటో)



నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్



చేపడుతున్న రోడ్డు పనులు

వేగంగా రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని వెంకటాపురం కొడవటిపూడిలో రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.1.67 కోట్లతో నిర్మిస్తున్న బిటి రోడ్డు నిర్మాణం పట్ల గ్రామస్తులు హర్షం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి జెఈ రెడ్డి మాట్లాడుతూ, వెంకటాపురం సబ్ స్టేషన్ నుండి విశ్వనాధపురం వరకు 8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపడు తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.



నగదును అందజేస్తున్న స్నేహితులు

రూ.31 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చీడికాడ:విద్యార్థి దశలో అందరూ కలిసి చదువుకున్నారు. ఓ స్నేహితుడు అనారోగ్యంతో ఉండటంతో వారంతా మానవతా హృదయంతో ఆర్థిక సాయం అందించారు. 1993వ సంవత్సరంలో చీడికాడ మండలం అప్పలరాజుపురం గ్రామంలో 10వ తరగతి బ్యాచ్‌లో కలిసి చదువుకున్న స్నేహితులలో ఒకరైన పిచ్చికా సత్యనారాయణ అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితం అయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.31000 వేల నగదు, రెండు బస్తాల బియ్యం, వంట నూనెను అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టా అప్పలకొండ, బత్తిన సత్యనారాయణ, మంకు దేముడు, కూరచ వెంకట రమణ, అనపగడ్డి అప్పారావు, నానాజీ పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ఆర్ఒ గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి:సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.గీతాంజలి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తహసిల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 18 నుండి 25వ తేదీ వరకు సెలవు రోజులు మినహా అభ్యర్థుల నుండి ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన్లు పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. నామినేషన్ వద్ద మీడియాకు ఆంక్షలు ఉన్నాయన్నారు. ఇతరులు బారికేడ్లను దాటి రావడానికి లేదన్నారు.నామినేషన్ సమయంలో అభ్యర్థుల వెంట నలుగురు మాత్రమే రావడానికి అనుమతి ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్ఒ గీతాంజలి

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు :ఓటు హక్కును అందరు సద్వినియోగం చేసుకోవాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్రలు కోరారు. మండలంలోని పనసపుట్టు పంచాయితీలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఓటర్లకు సౌకర్యంపై తెలిపారు. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, మద్యం పంపిణీ, తరలింపు చేయరాదని కోరారు. చట్ట విరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలు చేయరాదన్నారు. గంజాయి తరలింపు, వ్యాపారులకు సహాయం వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.



కళాకారులను సన్మానిస్తున్న గ్రామస్తులు

వాయిద్య కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద శ్రీనివాస భక్త సమాజ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సప్తాహం (భజన) బుధవారం ఉదయం 6 గంటలకు ముగిసింది. ఈనెల 10వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రారంభమైన సప్తాహం 17వ తేదీ ఉదయం 6 గంటల వరకు 7 రోజులపాటు భజన కార్యక్రమం నిర్వహించారు. అనేక గ్రామాల నుండి భజన బృంద సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాకారులను గ్రామ పెద్దలు సత్కరించారు .

19న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కేడిపేటలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడివి.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేడిపేట, నాగాపురం, శరభన్నపాలెం ఫీడర్స్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



నక్కపల్లి మండలం ఉపమాకలో నిర్వహిస్తున్న కల్యాణం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద బుధవారం శ్రీరామనవమి పురస్కరించుకుని అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహెూత్సవాన్ని నిర్వహించారు.ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు.

పాయకరావుపేట:మండలంలోని పాల్తేరు గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు ఆధ్వర్యాన భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామ వీధులలో వైభవోపేతంగా ఊరేగింపు చేపట్టారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలోని వెలంవీధి రామాలయం వద్ద నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని పూజలు నిర్వహించారు.

గొలుగొండ:మండలంలోని పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు రామాలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రామాలయాల వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో ఆలయానికి మహిళలు తరలి వచ్చారు. కైలాసపట్నం గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, పాములవాక గ్రామంలో కిల్లాడ శ్రీనివాసరావు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

అనకాపల్లి : వైసిపి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్, నివేదిత దంపతులు అనకాపల్లి పట్టణం, మండలంలోని పలు సీతారాముల దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూడిమడక రోడ్డులోని రామాలయం వద్ద జరిగిన సీతారాముల కళ్యాణంలో టిడిపి నేత బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పలు గ్రామాల్లో స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

కశింకోట : కశింకోటలో దాడి నాగరాజు కృష్ణవేణి దంపతులు, కొత్త అచర్లలో నిమ్మదల నాగేశ్వరరావు దంపతులు, తాళ్ళపాలెంలో ముత్తా నాగేశ్వరరావు సత్యవతి దంపతులు, ఏనుగుతునిలో మారిశెట్టి వెంకట రమణ దంపతులు పూజలు చేశారు.

పరవాడ : పరవాడ గ్రామంలో ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మీ దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో జరిగిన సీతారాముల కల్యాణ మహెూత్సవంలో జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ, కుంచ అంజిబాబు, గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు తదితరులు పూజలు చేశారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు దంపతులు సీతారాముల కళ్యాణం నిర్వహించారు.


బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, సీతయ్యపేట, పెదపూడి తదితర గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

పెందుర్తి : 93, 94, 96, 97, 98 వార్డులు, పెందుర్తి, చినముసిడివాడ వేపగుంట, పద్మనాభనగర్, సరిపల్లి ప్రాంతాల్లోని రామాలయాల్లో సీతారామ కల్యాణాన్ని నిర్వహించారు.

సీతమ్మధార : జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ ఉత్తర నియోజకవర్గంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 46వ వార్డు పరిధి కైలాసపురం, సంజీవ్‌కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లోని సీతారామ అభయ ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. 24వార్డు పరిధి టిపిటి కాలనీ, బృందావనం పార్కులో, రేసపువానిపాలెం, 25వ వార్డు పరిధి మూడు గుళ్ల జంక్షన్, మధురానగర్‌లో, 55వ వార్డు పరిధి రెడ్డి తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ వద్ద కల్యాణాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, కార్పొరేటర్లు సాడి పద్మా రెడ్డి, కెవిఎన్ శశికళ, సంపంగి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. క్షత్రియ సమితి ఆధ్వర్యాన క్షత్రియ కల్యాణమండపంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, సుమ దంపతులు. సిఎస్ వర్మ, దివ్య దంపతులు సీతారాముల కళ్యాణం జరిపించారు.

మధురవాడ : పిల్లకానిపాలెం, మల్లయ్యపాలెం, బట్టవానిపాలెంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. . భీమిలి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు.

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. 216 మంది దంపతులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 160 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిత

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ సర్పంచ్, వైసీపీ నాయకులు కాళ్ల శ్రీనివాసరావుతో పాటు పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందని అనిత అన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేపట్టి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడు గంటా నామినేషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు గంటా క్యాంప్ కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. బాణసంచా కాల్చరాదని పేర్కొన్నారు. దొరతోట మీదుగా భీమిలి వచ్చే వాహనాలు యోగాశ్రమం వద్ద, తగరపువలస మీదుగా వచ్చే వాహనాలు భీమిలి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద, బీచ్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు నోవోటల్ వద్ద నిలుపుదల చేయాలని సూచించారు. అక్కడి నుంచి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

జయప్రదం చేయండి

గంటా శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి చేశారు. గంటా క్యాంప్ కార్యాలయంలో బుధవారం జివిఎంసి మూడో వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెజారిటీ భారీగా ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అక్కరమాని దివాకర్, బిజెపి నాయకులు కె.రామానాయుడు, మూడో వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్, నాయకులు ఎం.సంజీవ్‌కుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు.

అర్ధరాత్రి పనులకు యత్నం.. ప్రతిఘటించిన కార్మికులు...

ప్రజాశక్తి- గాజువాక : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది రోజులగా ఆదాని గంగవరం పోర్టు కార్మికులు ప్రధాన గేటు వద్ద చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత పోర్టు లోపల ప్రయివేటు కార్మికులతో కార్యకలాపాలు నడపాలని యాజమాన్యం, పోలీసులు తీవ్రప్రయత్నం చేశారు. యాజమాన్యం చెప్పిన మేరకు స్థానిక పోలీసులు అర్ధరాత్రి భారీగా మోహరించారు. ప్రయివేటు వ్యక్తులచే పనులు చేయించాలని యాజమాన్యం ప్రయత్నించింది. దీనిపై కార్మికులందరూ ఒక్కసారిగా ప్రతిఘటించారు. ఆ సమయంలో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చాలా పెద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు భయభ్రాంతులకు గురిచేసినా కార్మికుల అధైర్యపడకుండా వారితో ఘర్షణకు దిగారు. ప్రయివేటు కార్మికులను పోర్టు లోపలికి అడుగుపెట్టనివ్వకుండా అడ్డగించి వెనక్కి వెళ్లగొట్టారు. పోలీసులు, యాజమాన్యం వెనక్కి తగ్గారు. బుధవారం ఆందోళననుద్దేశించి గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్, వైస్ ప్రెసిడెంట్ కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు సమస్యలు పరిష్కరించకుండా బలవంతంగా ఇతర కార్మికులతో పోర్టును నడపాలని చూడటం యాజమాన్యం మానుకోవాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించాలని పదే పదే కోరినా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గంగవరం పోర్టులో ఇస్తున్న వేతనాలతో కార్మికులు జీవితాలు, పిల్లల చదువులు, వైద్యం చేయించుకోవడానికి, ఇంటి అవసరాలు తీర్చుకోవడానికి సరిపోవటం లేదని తెలిపారు. కనీసం రూ.36 వేలు జీతం చెల్లించాలని కోరారు. పక్కనే ఉన్న విశాఖ పోర్టుతో సమానంగా వేతనాలు సవరించాలని కోరారు. కార్మికులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకుండా కార్మికులను బదిలీ చేయాలని చూడటం, సస్పెండ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కార్మికులకు ఇచ్చిన సస్పెండ్ నోటీసులు, ట్రాన్స్‌ఫర్ నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, గంటుపల్లి అమ్మోరు, మాద అప్పారావు, లోకరాజు, సత్తిబాబు, సత్తియ్యస్వామి తదితరులు పాల్గొన్నారు. పోర్టు కార్మికుల ఆందోళనకు సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఉక్కు కార్మిక నేతలు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ మద్దతు తెలిపి మాట్లాడారు.

గంగవరం పోర్టు వద్ద కొనసాగుతున్న ఆందోళన



గంగవరం పోర్టు కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఉక్కు పోరాట కమిటీ నేతలు



అగనంపూడిలో ప్రచారం చేస్తున్న జగ్గునాయుడు

అగనంపూడిలో సిపిఎం ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక : ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు బుధవారం అగనంపూడి ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ కలుసుకొని తనకు ఓటు వేయాలని కోరారు. కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొన్నారు.

స్వతంత్రనగర్‌లో...

ఎం.జగ్గునాయుడు గెలుపు కోరుతూ బుధవారం సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. స్వతంత్రనగర్, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, ఎస్‌టి కాలనీల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పేదలకు స్థానికంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగానే స్వతంత్రనగర్ లాంటి కాలనీలు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. పేదల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో డి.రమణ, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

పరామర్శ

అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చేరి డిస్చార్జ్ అయిన ఐద్వా జిల్లా పూర్వ ఉపాధ్యక్షులు ఎస్.నూకరత్నాన్ని ఎం.జగ్గునాయుడు బుధవారం ఆమె నివాసంలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. 1986లో అచ్చుతాపురంలో పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇద్దరూ కలిసి పనిచేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత నియోజకవర్గ ప్రచార వివరాలు నూకరత్నం అడిగి తెలుసుకున్నారు. కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ఎస్ఎన్. మూర్తి, స్టీల్‌ప్లాంట్ ప్రజా నాట్యమండలి నాయకులు కెటివి.భాస్కర్, ఎస్‌వికె.పరశు రామ్ ఉన్నారు.

మళ్ల సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి -అనకాపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత కామ్రేడ్ మళ్ల సత్యనారాయణ ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మళ్ల సత్యనారాయణ ప్రథమ వర్ధంతి కార్యక్రమం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ మళ్ళ సత్యనారాయణ విద్యార్థి ఉద్యమం నుండి వామపక్ష భావాలతో పనిచేశారని తెలిపారు. అనకాపల్లిలో మున్సిపల్, ముఠా కార్మిక సంఘాలను, బెల్లం మార్కెట్ కొలగార్లు కళాసీ సంఘాలను నిర్మించి వారి సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులకు ద్రోహం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని, లౌకిక శక్తుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మళ్ల సత్యనారాయణ సతీమణి మళ్ల సరోజిని, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మళ్ల చంద్రశేఖరరావు, జీవీఎంసీ ఉద్యోగుల సంఘం నాయకులు వై.యేసురాజు, బెల్లం మార్కెట్ కోలగార్ల సంఘం నాయకులు మణి, సిపిఎం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాళ్ళ తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, వివి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మళ్ల సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లోకనాథం, నాయకులు



పవన్ కల్యాణ్ నుండి బి.ఫారం అందుకుంటున్న కొణతాల

జనసేన అభ్యర్థులు కొణతాల, విజయ్‌కుమార్‌కు బి.ఫారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి, అచ్యుతాపురం

మే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొణతాల రామకృష్ణకు, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్‌కు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బి-ఫారాలు అందజేశారు.

కూటమిని, వైసిపిని ఓడించాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్, నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసీపీని చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి ఐఆర్.గంగాధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అనకాపల్లి గాంధీనగర్, అంజయ్య కాలనీలో ఇంటికి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రాష్ట్రానికి ప్రత్యేక హెూదాతో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపొచ్చని చెప్పారు. జగన్ కేసులకు భయపడి మోడీకి బానిసగా మారారని ఎద్దేవా చేశారు. మోడీతో జతకట్టిన జనసేన, టిడిపికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపితో ఏ ముఖం పెట్టుకొని పొత్తులకు దిగారని గంగాధర్ ప్రశ్నించారు. ఇప్పటికే గంగవరం పోర్ట్‌ని మోడీ స్నేహితుడు అదానికి అమ్మేశారని, స్టీల్ ప్లాంట్‌ను కూడా ఆయనకే అమ్మడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్ ఏనాడు రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, సనేడ గజ్జాలు, ఎగ్గాడ భాస్కరరావు, గౌరీపట్నపు గున్నబాబు, కొల్లి సత్యారావు, ఏడువాకుల దేవుడమ్మ, ఈరుగుల దుర్గాప్రసాద్, ఉల్లింగల సంతోష్, అవినాష్ ఇళ్ళ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుందరపు, రేపు కన్నబాబురాజు నామినేషన్లు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం జనసేన, వైసిపి అభ్యర్థులు సుందరపు విజయకుమార్, కన్నబాబు రాజు నామినేషన్లు వేయడానికి తేదీలు ఖరారు చేసుకున్నారు. సుందరపు విజయకుమార్ గురువారం ఉదయం 10 గంటలకు తన అనుచరులతో వచ్చి యలమంచిలి తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే కన్నబాబు రాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నామినేషన్ల ఘట్టం శాంతియుతంగా జరిగడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్ట భద్రతా సిబ్బంది తెలిపారు.